విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 38 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi గురువారం 19 ఫిబ్రవరి 2026 • పేజీలు : 8 • వెల 2/-


## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

### తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ

### మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది.తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ

మిగతా 2వ పేజీలో..

## గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

- నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ...
- అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**ముంబయి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల

మిగతా 2వ పేజీలో..




## దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

### తరచూ వారితో సమావేశం అవుతున్నారు
### విదేశీ పర్యటనల్లో ఇదే జరుగుతోంది

### కేంద్రమంత్రి కిరణ్ రిజజు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత , లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌గాంధీకి భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. విదేశీ పర్యటనల సమయంలో విపక్షనేత వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జిసోరస్ లాంటి వ్యక్తులతో సమావేశమవు తున్నారని అన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదక రమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో

మిగతా 2వ పేజీలో..

## టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

- గొడవలు చేయడం కాదు..ఆధారాలతో రండి
- వైసిపి సభ్యులకు హోంమంత్రి అనిత సవాల్

**అమరావతి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్) :** టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీలో తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చర్చ కాకుండా రచ్చ చేయాలనుకుంటున్న వైసిపి సభ్యుల తీరుపై మండిపడ్డారు. చేసిన పాపాలు బయటపడకుండా చేస్తున్న రాద్ధాంతంగా అభివర్ణిం చారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని సవాల్ చేశారు. ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు ఛాలెంజ్ చేశారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై చర్చకు సిద్ధమని మంగళవారం సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని అన్నారు. అసెంబ్లీ మీడియా

మిగతా 2వ పేజీలో..



## రాజమండ్రి జైలు నుంచి అంబటి విడుదల

### ఎన్నిరోజులు జైల్లో పెట్టినా వెనక్కి తగ్గేది లేదన్న రాంబాబు




**రాజమండ్రి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 2వ పేజీలో..

## కొలంబోకు సొంత దుడ్లతోనే వెళ్లా

### వైకాపా ఆరోపణలను తిప్పికొట్టిన లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** ఇటీవల కొలంబోలో జరిగిన భారత్-పాక్ మ్యాచ్‌కు తన సొంత ఖర్చుతో వెళ్లానని ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధనం ఖర్చు చేసి వెళ్లినట్లు వైకాపా సొంత మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనకు అంతటి దుస్థితి పట్టలేదన్నారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగతమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్? అని లోకేశ్ తనదైన శైలిలో పేర్కొన్నారు. శాసన మండలిలో వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ పార్టీ సభ్యులపై పట్టు కోల్పోయారని నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారని చెప్పారు. ఒకరు కల్తీ లడ్డూపై.. మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చ కోరుతున్నారన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారోనని తమకు ఆసక్తిగా ఉందని చెప్పారు. సభలో తమ స్ట్రాటజీ ఏంటో చూస్తారుగా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

### రంగంలోకి దగిన బాంబ్ స్క్వాడ్ బృందాలు

**హైదరాబాద్/అమరావతి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు

మిగతా 2వ పేజీలో..



## విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

- ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి
- ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం, డిప్యూటి సిఎం

**విశాఖపట్నం,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్):** దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు

మిగతా 2వ పేజీలో..



## వైసిపి ఎమ్మెల్యేతో టిడిపి ఎమ్మెల్యేల సరదా

**అమరావతి,ఫిబ్రవరి18 (చట్టం న్యూస్) :** అసెంబ్లీ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలకు వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ తారసపడ్డారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, అశోక్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలను వైకాపా ఎమ్మెల్యే పలకరించారు. ఈ సందర్భంగా వీరి మధ్య సరదా చిట్‌చాట్ జరిగింది. బిల్ గేట్స్ స్థాయి తెలియకుండా విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందని తెదేపా ఎమ్మెల్యేలు ఆయనను అడిగారు. అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ లెక్కలు అడగకుండా.. ప్రెస్‌మీట్ పెట్టి బిల్‌గేట్స్ టీ, కాఫీ ఖర్చులంటూ నవ్వులపాల య్యారుగా.. అని ఎంఎస్ రాజు ఎద్దేవా చేశారు. అన్నీ తెలిసే నన్ను ఆడుకుంటున్నారుగా... మీకో నమస్కారం అంటూ చంద్రశేఖర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

### అరెస్ట్ చయకుండా వేసిన పిటిషన్ తిరస్కరణ

**అమరావతి,ఫిబ్రవరి18(చట్టం న్యూస్):** విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో సినీనటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) ఛాన్సలర్ మోహన్‌బాబుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. కిడ్నాప్‌నకు ముందు, తర్వాత వర్సిటీ పీఆర్వో సతీష్‌తో మోహన్‌బాబు మాట్లాడారని, మెసేజ్‌లు పంచుకున్నారని పోలీసులు చెబుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామంటూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మార్చి 3కు వాయిదా వేశారు. ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు ప్రత్యక్ష ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే బౌన్సర్లను అరెస్ట్ చేశారు.

## అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

### వారితో మాటామంతీ నిర్వహించిన స్పీకర్

**అమరావతి,ఫిబ్రవరి 18 (చట్టం న్యూస్) :** అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి బుధవారం కూడా కొందరు విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. చర్చలు బాగా జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. సీఎం చంద్రబాబును చూడాలని ఉందని చెప్పారు విద్యార్థులు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం

మిగతా 2వ పేజీలో..



# దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

**మొదటి పేజీ తరువాయి..**

ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు , తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

# రాజమండ్రి జైలు నుంచి అంబటి విడుదల

**మొదటి పేజీ తరువాయి..**

మీడియాతో మాట్లాడారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తాను ఉన్నానని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కక్షగట్టి తనను జైల్లో పెట్టారని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని.. వెనుకడుగు వేయనని స్పష్టం చేశారు. తన ఇంటిపై ఏడు గంటలు దాడి
జరిగిందని అంబటి రాంబాబు ప్రస్తావించారు. పోలీసులు ఉండగానే తన ఇంటిపై దాడి జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలపై ప్రజలకు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. తనపై దాడిని చంద్రబాబు, లోకేశ్ మానిటరింగ్ చేశారని ఆరోపించారు. హోంమంత్రి వంగలపూడి అనిత కానిస్టేబుల్‌ను కూడా బదిలీ చేసే పరిస్థితుల్లో లేరన్నారు. ఎన్ని రోజులు జైల్లో పెట్టినా వెనక్కు తగ్గనని, ప్రజాస్వామ్యబద్ధంగా చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలగొట్టేవరకు పోరాడతానని స్పష్టం చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలును ఓ శిక్షణా కేంద్రంగా తీసుకున్నానని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

**మొదటి పేజీ తరువాయి..**

బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

# అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

**మొదటి పేజీ తరువాయి..**

రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడికి వెళ్లారని అధికారులు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు చూసిన పలువురు విద్యార్థులు తమకు పోలవరం ప్రాజెక్టు కూడా చూడాలని ఉందన్నారు. ఈసారి నుంచి విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టుని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాటిచ్చారు. తమకు అసెంబ్లీ సమావేశాలు నేరుగా చూడటం కొత్త అనుభూతి కలిగిందని విద్యార్థులు పేర్కొన్నారు.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

**మొదటి పేజీ తరువాయి..**

9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

# దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

**మొదటి పేజీ తరువాయి..**

రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షాలు సిద్ధమవడంపై కూడా రిజిజు మాట్లాడారు. ప్రతిపక్షాలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్‌గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు అంతరాయం కలిగిస్తారని అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయనలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదని రిజిజు విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ ఇలా సభకు అంతరాయం కలిగించడంవల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకునే వారికి అవకాశం దక్కట్లేదని చెప్పారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని, జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించారు. అయితే రాహుల్ తన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు నిషికాంత్ దూబే విమర్శించారు. ఫిబ్రవరి 12న లోక్‌సభలో రాహుల్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# నర్సరీని సందర్శించిన సర్పంచ్

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 18 :** బుధవారం ముచ్చర్ల గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ నర్సరీ సందర్శించడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అనురాధ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల పాల్గొనడం జరిగింది.




# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

**మొదటి పేజీ తరువాయి..**

గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణ మైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం÷-ర అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐటెం,ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి




2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్,ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఏకానమీగా ప్రకటించగా, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశిరచినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా ప్లస్ 1 కు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8? లేదా దాదాపు 25? గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. దేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ఓఆర్ఆర్, ట్రిప్ ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఃూతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఇవిల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే ఇవి తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

**మొదటి పేజీ తరువాయి..**

పాయింట్ వద్ద అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని.. రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా ఉందని.. ఆ సంస్థ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధనను తమ ప్రభుత్వం పెట్టిందని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని... ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పేపర్‌లో యాడ్‌ల కోసం రూ.600 కోట్ల ప్రభుత్వ ధనాన్నిదుర్వినియోగం చేశారని హోంమంత్రి అనిత ఆరోపించారు. వైసీపీ నేతల్లాగా తమకు దుర్బుద్ధి లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులే కల్తీ లడ్డూ మీద వాయిదా తీర్మానం, ఇందాపూర్ డెయిరీ పైన వాయిదా తీర్మానం ఇచ్చారని ప్రస్తావించారు. మదనపల్లి చిన్నారి ఘటన విషయంలో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతను చేసింది తప్పని.. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

### నగరంలో అర్హుల జాబితా తయారీ

### అసంపూర్తి 2 బిహెచ్‌కె ఇళ్ల పూర్తి

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి18 :హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్ నందు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (ఒ2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ ప్లస్ 5-10 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు.. పెండింగ్ లో ఉన్న 2 బిహెచ్‌కె ఇళ్ల పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్దిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు



ప్రాంతాల్లో 2 బిహెచ్‌కె లబ్దిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి మంత్రులు సమీక్షించారు. తదుపరి హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---------------------

# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించేది విద్య మాత్రమే

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 18 చట్టం ప్రతినిధి :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవన విధానమును అలవరచుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అందుబాటులో వున్న అవకాశాలను, వసతులను, వనరులను సద్వినియోగం చేసుకొని కృతార్థులవ్వాలని పూర్వపు సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సస్ చైర్మన్ మరియు పూర్వపు సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కె.వి. చౌదరి అన్నారు. హీల్ వార్షికోత్సవ సందర్భముగా జరిగిన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భముగా చుండూరు కోటయ్య-రామ శేషమ్మ ఫౌండేషన్, నిహారిక ఫౌండేషన్,మాచినేని గ్రాండియస్, కోట.శేఖర్, కొడాలి వెంకట శివప్రసాద్, కాకర్ల శంకర రావు ఇచ్చిన ఆర్థిక సహాయముతో రెండు తెలుగు రాష్ట్రలకు చెందిన 25 మందికి కృత్రిమ కాళ్ళను అందచేశారు. వివిధ సబ్జెక్ట్ లలో, క్రీడలలో ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోనేరు సత్య ప్రసాద్, దాతలు వేగే.వాసు, చుండూరు మధుసూధనరావు, కాకర్ల నిరుపమ, గౌరా. జ్యోతి, హీల్ డైరెక్టర్లు పిన్నమనేని ధనప్రకాష్,



మలినేని రంగప్రసాద్, యలమంచిలి బాలాజీ, సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు రెడీ చేయండి..

- మార్చి 31 వరకు నిర్మాణ పనులన్నీ పూర్తి చేయండి..
- ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించండి..
- పెండింగ్లో పెట్టవద్దు..
- ఇసుక ఇటుక సిమెంటు కొంత చవకగా లభించేలా అధికారులు దృష్టి సారించాలి..
- కరీంనగర్ జిల్లాలో వేగంగా ఇండ్ల నిర్మాణం..
- ప్రోగ్రెస్ చాలా బాగుంది..
- డబుల్ బెడ్ రూమ్ లను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోండి..
- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్..
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి అలుగునూరు, కోతి రాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన
- ఇండ్ల ప్రోగ్రెస్ పై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కితాబు..



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 18,( చట్టం బ్యూరో) :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మొదటి దశలో ప్రారంభించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిచేసుకునేలా చూడాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులు సంబురంగా గృహప్రవేశాలు జరుపుకునేలా ఇండ్లను రెడీ చేసి ఇవ్వాలని సూచించారు.

బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు కోతి రాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రగతిని క్షేత్రస్థాయిలో ఎండి గౌతం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి పర్యవేక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో ఎండి స్వయంగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనులకు ఎంత ఖర్చయింది.. ఎలా పనులు చేయిస్తున్నారు.. ఇసుక.. ఇటుక..కంకర కు ఎంత ధర చెల్లిస్తున్నారు.. బిల్లులు సకాలంలో వస్తున్నాయా.. నిర్మాణ పనుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా.. ఇప్పటివరకు పనులకు ఎంత ఖర్చు చేశారు.. పనులను ఏ విధంగా చేస్తున్నారు అని సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అన్ని వివరాలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో హ్యాపీగా ఫీల్ అవుతున్నామని వారు ఎండికి వివరించారు. సొంటి కల నెరవేరుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండి గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ పెండింగ్లో పెట్టవద్దని పనులు మరింత వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొదటి దశలో ప్రారంభించిన ఇండ్ల తుది పనులు మార్చి 31పూర్తి కావాల్సిందేనని పేర్కొన్నారు. పనులకు సంబంధించి ఎక్కడా జాప్యం జరగవద్దని అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఇసుక ఇటుక సిమెంటు కొంత చౌక ధరల్లో లభించేలా అధికారులు డీలర్లు నిర్వాహకులతో మాట్లాడాలని ఆదేశించారు. కొంత ధర తగ్గడం వల్ల లబ్ధిదారులకు చేయూతనందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. దగ్గర్లో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రోగ్రెస్ చాలా బాగుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో పాటు అధికారులను అభినందించారు. బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు వారం పదవులకు ఒకసారి బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

ఆ తర్వాత కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో ఎండి గౌతమ్ సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రెడీ చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకేమైనా పనులు పెండింగ్లో ఉంటే వాటిని పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి తిమ్మాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో పాటు హౌసింగ్ అధికారులు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# దేశ వ్యవసాయ రంగం పై వేలాడే కత్తిలా.. భారత్ అమెరికా ట్రేడ్ డీల్

- భారత్ అమెరికా ట్రేడ్ డీల్ పై బహిరంగ లేఖ
- భారత్ అమెరికా ట్రేడ్ డీల్ పై రైతాంగం పక్షాన కేంద్ర ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు
- ట్రేడ్ డీల్ వల్ల లాభాలు ఏమిటి? నష్టాలు ఏమిటి?

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 18 :** ...ట్రేడ్ డీల్ వల్ల అమెరికా నుంచి జెనిటికల్ మాడిఫైడ్ విత్తనాలు ఆహార పంటలు దిగుమతులు వల్ల దేశ వ్యవసాయ రంగం కార్పొరేట్ మార్కెట్ కబంధ హస్తాల్లో చిక్కదా?

..దేశీయ వాతావరణ పరిస్థితులు తట్టుకుని వందల ఏళ్లుగా సాగులో ఉన్న విత్తనాలు కనుమరుగు అవ్వవా?.అధిక ఉత్పత్తి కోసం జెనిటికల్ మాడిఫైడ్ విత్తనాలు సాగు చేస్తే రోగ నిరోధక వ్యవస్థ పై ప్రభావంతో ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారదా?

..అమెరికా నుంచి మొక్కజొన్న పత్తి దిగుమతుల తో మన దేశ రైతాంగం నష్ట పోరా?

.అమెరికా లో సాగు విస్తీర్ణం ఎక్కువ రైతులు తక్కువ.కానీ మన దేశంలో చిన్న చిన్న భూ కమతాలు సన్నకారు రైతాంగం.మన దగ్గర



పది వేల మంది రైతులు సాగు చేసే భూమి అమెరికా లో ఒక రైతు సాగు చేసేది వాస్తవం కాదా?

..అమెరికా నుంచి పంట ఉత్పత్తులు మొక్కజొన్న పత్తి దిగుమతుల వల్ల మన దేశంలో కోట్ల మంది రైతులు జీవనోపాధి కి ప్రమాదం కాదా?.అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతులు వల్ల మెక్సికో లో తలెత్తిన అనుభవాలు మీకు తెలియదా?..78 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో నేటికీ విత్తనాల కోసం విదేశీ కార్పొరేట్ కంపెనీల పై ఎందుకు ఆధార పడ్డాం?

. మేకిన్ ఇండియా నినాదం మూడో టర్మ్ మోడీ పాలనలో ఎందుకు దేశవాళీ విత్తనాలు ఉత్పత్తి లేదు?..ఇంకా ఎన్నాళ్లు విదేశీ బీ.టీ టెక్నాలజీ.. జీఎం విత్తనాల దిగుమతులు?

.హరిత విప్లవం తో పెరిగిన జనాభా కు తగినంత ఆహార ధాన్యాల ఉత్పత్తి చేయడంలో స్వయం సమృద్ధి సాధించాం సంతోషం.

..కానీ హరిత విప్లవం వెలుగులో చీకటిలా దేశీయ విత్తనాలు కనుమరుగు అయ్యాయి.హైబ్రిడ్ సీడ్స్ తో అధిక పంట ఉత్పతులే కానీ రాశి గొప్ప నాణ్యత దిబ్బలా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి విజ్ఞప్తి

..అమెరికా ట్రేడ్ డీల్ తో మన దేశ వ్యవసాయ రంగం కష్టాల ఊబిలోకి పోకుండా మీరు చేపట్టే ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటి?

.విచ్చల విడిగా పత్తి మొక్కజొన్న ఉద్యాన పంటలు వంట నూనెల దిగుమతులుతో కోట్లాది రైతులకు తలెత్తే నష్టాలు సమస్యలు ఎలా పరిష్కారం చూపిస్తారు?

..కేంద్ర ప్రభుత్వం అమెరికా తో స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో వ్యాపారి లక్షణాలతో వ్యవహారం చేస్తున్నారు తప్ప

మన దేశంలో వ్యవసాయం ఆత్మ గౌరవం జీవన విధానం గ్రామీణ పల్లెలకు జీవనాధారం అన్న సత్యం ఎందుకు విస్మరించారు?

కోట్లాది మంది సన్నకారు రైతాంగ ప్రయోజనాలు పణంగా పెట్టి ..పిడికెడు మంది కార్పొరేట్ కంపెనీల కోసం అమెరికా సంపన్న కార్పొరేట్ రైతుల కోసం ట్రేడ్ డీల్ తో గేట్లు బార్లా తెరిస్తే రానున్న రోజుల్లో దేశ రాజధాని డిల్లీ పై రైతాంగం దండయాత్ర లు చేయాల్సిందేనా?

.యుగ యుగాలుగా అనాదిగా వ్యవసాయ రంగంలో భారత దేశ ప్రస్థానం

చరిత్ర.. కాల గర్భంలో కలిసేలా ట్రేడ్ డీల్ దేశ రైతాంగం మెడ పై వేలాడుతున్న కత్తి నీ మీరెందుకు అనుమతి ఇచ్చారు?..చరిత్ర పుటల్లో దేశ వ్యవసాయ రంగానికి కీడు చేసిన ప్రధానిలా మోడీ నిలుస్తారా? లేక ట్రేడ్ డీల్ తో దేశ రైతాంగానికి మేలు చేస్తారా?మీ విధానం ఏమిటో కోట్లాది మంది రైతుల మదిలో మెదిలే సందేహాల పై వైట్ పేపర్ తో నివృత్తి చేయాలని రైతాంగం పక్షాన విజ్ఞప్తి

మందడపు సుధాకర్ రైతు సంఘం నాయకులు

# త్రివేణి లో "మీట్ అండ్ గ్రీట్ విత్ డైరెక్టర్"








**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 18 :** ఖమ్మం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ త్రివేణి పాఠశాలలో రాబోయే పదవ తరగతి పరీక్షలలో పిల్లలను సన్నద్ధులను చేయుటకై. "మీట్ అండ్ గ్రీట్ విత్ డైరెక్టర్" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి పాల్గొని తన స్వ అనుభవాలని పిల్లలకు వివరిస్తూ త్రివేణి పిల్లలు సమాజంలో మంచి లక్షణాలున్న వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని, ఎంత ఎత్తుకు ఎదిగిన కన్న తల్లిదండ్రులను అలాగే గురువులను గుర్తుంచుకొని వారిని ప్రతినిత్యం స్మరించుకోవాలని తెలిపారు. ఇతరులకు ఎల్లవేళలా సహాయం చేస్తూ "కలిసి ఉంటే కలదు సుఖం" అనే నానుడి నిజం చేయాలని, పట్టుదలతో మనం ఎంచుకున్న మార్గంలో ముందుకు వెళ్లాలని "కృషితో నాస్తి దుర్భిక్షం"అనే త్రివేణి పాఠశాల నినాదాన్ని నిజం చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా త్రివేణి పాఠశాల యొక్క పూర్వ విద్యార్థులు ఐఐటి మెయిన్స్ ఎగ్జామ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వి ఎస్ ఎస్ లక్ష్మి, మోక్షిత సాయి, సాయి సాత్విక మరియు వెంకటేశ్వర్లను అభినందించి సత్కరించారు భవిష్యత్తులో అడ్వాన్స్ ఎగ్జామ్ లో కూడా మంచి ప్రతిభ కనబరిచి దేశంలోనే అత్యున్నత ఐఐటిలో చదివి భవిష్యత్తుని బంగారు మయంగా మలుచుకోవాలని దీవించారు. ఇట్టి కార్యక్రమంలో సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, చీకటి అప్పారావు, అర్చన ఠాకూర్, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

--------

# పకడ్బందిగా పరీక్షలు ..!




**కర్నూలు, చట్టం (కర్నూల్ -02-2026):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు నందు రికార్డు అసిస్టెంట్ మరియు ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ రెగ్యులర్ ఉద్యోగ పోస్ట్ ల కొరకు ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్. 1/2026, 3/2026 ప్రకారం ఈ రోజు 18 వ తారీఖున నిర్వహించిన వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల లిస్టులను డిస్టిక్ కోర్టు వెబ్సైట్ www.ecourt-skurnool.com మరియు https://kurnool.dcourts.gov.in నందు పొందుపరచడమైనది. ఓరల్ ఇంటర్వ్యూకు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ వెబ్సైట్ నందు తమ పేర్లను చూసుకొని ఈ నెల 20న మధ్యాహ్నం 3-00 గంటలకు జిల్లా న్యాయ సేవా సదన్,కర్నూలు నందు హాజరు కావలసిందిగా కోరడమైనది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి మరియు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఇతర న్యాయమూర్తులు ఆధ్వర్యంలో మరియు ప్రసున్న లా కాలేజీ ప్రిన్సిపల్ శివాజి రావు మరియు టూ టౌన్ సిఐ నాగరాజా రావు వారి సహకారంతో ఈరోజు నిర్వహించిన వ్రాత పరీక్షలు సజావుగా నిర్వహించడమైనది. అలాగే ఉదయం నిర్వహించిన రెండు పరీక్షల గాను ఆదే రోజు మధ్యాహ్నం 04-00 గంటలకు ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల లిస్టును వెబ్సైట్ నందు పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి. కబర్థి , న్యాయమూర్తులు , డిఎల్ ఎస్ ఏ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నేడే శివాజీ మహారాజ్ జయంతి శోభాయాత్ర

- ప్రతి యేటా అట్టహాసంగా జరగనున్న శివాజీ మహారాజ్ శోభాయాత్ర
- శివాజీ మహారాజ్ 396 వ జయంతి సందర్భంగా భారీ ఏర్పాట్లు
- శివాజీ విగ్రహాన్ని వాహనం పై నుండి గల్లి గల్లీ తిప్పుతూ జయంతి వేడుకలు
- జరపనున్న హిందూ వాహిని కార్యకర్తలు
- మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 18:** ఖమ్మం... నేడే ఖమ్మం నగరంలో శివాజీ మహారాజ్ జయంతి శోభాయాత్ర. పెవిలియన్ గ్రౌండ్ నుండి జమ్మిబండ వరకు శోభాయాత్ర అట్టహాసంగా జరుగుతుందనీ హిందూ వాహిని జిల్లా సంయోజక్ బోయిన సందీప్ కుమార్ తెలిపారు. హిందూ వాహిని ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వేల సంఖ్యలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేస్తారనీ ఆయన అన్నారు. నగరం మొత్తం కాషాయ ధ్వజాలు ఏర్పాటు చేసి, ప్రతి ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో శివాజీ మహారాజ్ జయంతి శోభాయాత్ర చేస్తామన్నారు. మహిళలు సైతం పెద్ద ఎత్తున శోభాయాత్రలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఏడు వలే ఈ ఏడు మహారాజ్ శోభాయాత్ర ప్రతి ఒక్కరిని సోదర భావంతో భావించి నడిపించాలని కార్యకర్తలను కోరారు.

## జామియా మసీదులో ప్రతిరోజు సహారి ఏర్పాటు. : ముతవల్లి ఇక్బాల్ భాష.

**నార్పల ఫిబ్రవరి 18, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలోని జామియా మసీదు (పెద్ద మసీదు)లో రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న సందర్భంగా ఉపవాస దీక్షలో ఉండే వారికోసం ప్రతిరోజు తెల్లవారుజామున జామియా మసీదు ఆవరణములో ముస్లిం యువకుల ఆధ్వర్యంలో సహారి ఏర్పాట్లు చేస్తున్నట్లు ముతవల్లి ఇక్బాల్ భాషా తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ముస్లిం యువకులందరూ కలిసికట్టుగా డబ్బులు పోగు చేసుకొని పెద్దల సహకారంతో జామియా మసీదు నందు రంజాన్ మాసం మొత్తం ప్రతిరోజు తెల్లవారుజామున ఉపవాసం (రోజా) ఉండే వారి కోసం సహారి (తెల్లవారుజమున భోజన ఏర్పాట్లు) చేస్తున్నట్లు తెలిపారు ఉపవాస దీక్షలో ఉండే వారు ఎవరైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అని అన్నారు ఉపవాస దీక్ష ఉండే వారికోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంతంగా డబ్బు ప్రోగు చేసుకొని మంచి పనిని చేపడుతున్న ముస్లిం యువతను పలువురు ప్రత్యేకంగా ముస్లిం పెద్దలు మరియు సోదరీ సోదరీమణులు అభినందనలు తెలియజేశారు



## బూరుగుపల్లిలో పలు అభివృద్ధికి పనులకు శంకుస్థాపన

**బోయిన్ పల్లి మండలం / ఫిబ్రవరి 18 , ( చట్టం న్యూస్ ) :** బోయిన్ పల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ పెంచాల సౌజన్య మహేష్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. బూరుగుపల్లి బస్టాండ్ నుండి బోయిన్ పల్లి వరకు రోడ్డు ఇరువైపుల కరెంట్ పోల్స్ ను బిగించారు. కరెంట్ పోల్స్ వేయడం పట్ల పలువురు ప్రజలు వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కళ్లేపల్లి చంద్రయ్య,పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు



# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్మాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేడు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళ్లుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్ధతిలో పరిష్కారం చేయలేదు. వీటిని పరిశీలించి పరిష్కరించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి మేలైన పాలనకు బాటలు వేయాలి.

## యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

### స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జలపూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకురార్పణ ఉంటుంది. 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం భేరి పూజ చేపడతారు. ఫిబ్రవరి 20 న ఉదయం మత్స్యావతార అలంకారం, సాయంత్రం శేష వాహన సేవ వేదపారాయణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ,22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహనసేవ చేపడతారు.

23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవ ఉంటుంది. 24న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనం పై రాత్రి ఎదుర్కోలు వేడుక చేస్తారు. 25న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 26న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం,27 న స్వామి వారి చక్రతీర్థ స్నానం. ఫిబ్రవరి 28 న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నారు.

## యూట్యూబ్ వీడియో ప్లాట్‌ఫామ్‌లో సాంకేతిక సమస్య

### పలుదేశాల్లో వీడియో ప్లేకు అంతరాయం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 : ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మంగళవారం రాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తుంటే ఎర్రర్ అని చూపిస్తోంది. కొంతమందికి యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికాలోనే మూడు లక్షలకు పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవుట్‌టేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఈ సమస్య మంగళవారం రాత్రి 8 గంటలకు అమెరికాలో మొదలైంది. తమ వెబ్‌సైట్‌కు అమెరికాలో 3,20,000 కంటే ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఇండియా నుంచి కూడా 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీడియోలు ప్లే కావడం లేదని, సెర్చ్ రిజల్ట్ కనిపించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్ సాంకేతిక సమస్యలపై ఆ సంస్థ యాజమాన్యం స్పందించింది.
స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్యయ పరిష్కారం కోసం పనిచేస్తున్నామని పేర్కొంది.

-------------

# హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ నందు పిఏడి సమస్య వచ్చిన వారికి ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 18 :** ఖమ్మం యశోద హాస్పిటల్ లో జరిగిన సమావేశంలో ఎంబిబిఎస్ , ఎంఎస్ ( జనరల్ సర్జరీ ) , డి ఎన్ బి (వసక్యూలర్ సర్జరీ ) , కన్సల్టెంట్ వసక్యూలర్ ః ఎండువాసక్యూలర్ సర్జన్ ఫుట్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీ కాంత్ రాజు మాట్లాడుతూ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ నందు పిఏడి సమస్య వచ్చిన వారికి అడ్వాన్స్ టెక్నాలజీ ప్రొసీజర్ తో అత్యాధునిక సదుపాయాలతో అతి తక్కువ ఖర్చుతో ఓల్డ్ క్లాస్ స్థాయిలో ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం అందిస్తున్నాం అన్నారు . ఈ ప్రొసీజర్ ను నిడిల్ పంచర్ ద్వారా జస్ట్ వైర్లు పాస్ చేస్తారు ఎక్కడ కూడా ఒక్క కోత కూడా కనబడదు ఎటువంటి మత్తుమందు ఇవ్వకుండా పేషంట్ సృహలో ఉన్నప్పుడే చేస్తారన్నారు . ఆ తర్వాతకి యధా విధంగా అన్ని పనులు చేసుకోవచ్చు అని తెలిపారు . కాళ్లకు సంబంధించిన ఫిజికల్ యాక్టివిటీ వ్యాయామం చేయడం , దుమ్మపానం , మద్యపానాలకు దూరంగా ఉండటం వల్ల ఆపరేషన్ ద్వారా వచ్చే ఫలితాన్ని ఎక్కువకాలం అనుభవించగలరని పేర్కొన్నారు . యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇన్ఫో స్ట్రక్చర్ ఉండటం వల్ల ఇప్పటివరకు ప్రతి నెల సుమారు 100 నుంచి 150 మంది పేషెంట్లను




రికవరీ చేసి పంపిస్తున్నామన్నారు . ప్రతి ముగ్గురిలో ఒకరికి షుగరు కంపల్సరిగా ఉంటుందని షుగర్ ఉండే వంద మందిలో 30 మందికి పెరిఫెరల్ అరటీరియల్ డిసైజ్ (పిఏడి) సమస్య ఉంటుందన్నారు . ఈ సమస్య వచ్చిన వారిలో మూడు రకాల సింటమ్స్ చూపిస్తుంది . ఫస్ట్ ది నడిచేటప్పుడు పిక్కలు బాగా పట్టుకుని భరించరని నొప్పితో ఏటువంటి పని చేసుకోలేరు , రెండవది పాదాలలో భరించరాన్ని నొప్పుతో నిద్ర పట్టక మనిషి ఆత్మహత్య చేసుకోవాలనే స్థితిలో ఉంటాడు , మూడవది మానని గాయాలు కాళ్లలో అవడం , కాళ్లలో ఒక భాగం నల్లగా మారడం , కుళ్ళిపోవడం , దుర్వాసన రావడం వంటి లక్షణాలు ఉంటాయి . అలా ఉన్నప్పుడు వెంటనే వాస్కులర్ సర్జన్ డాక్టర్ ను కలిసి సలహా సూచనలు తీసుకోవాలన్నారు . వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకుని అవసరాన్ని బట్టి డాప్లర్ టెస్ట్ , సిటీ యాంజియోగ్రామ్ టెస్టు లు చేపించుకోవడం ద్వారా వ్యాధి తీవ్రత బయటపడుతుందన్నారు . ఈ వ్యాధిని సీరియస్గా తీసుకుని వీళ్ళెంతవరకు చికిత్స చేయించుకోవాలని సూచించారు . ఒకేసారి రెండు కాళ్ళకు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు . ఇది ఎక్కువగా తంబాకు , సిగరెటు , మద్యపానం తీసుకునే వారికి మరియు ఉబకాయం ఉన్న వారికి ఈ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి అన్నారు . ఇది వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది లేదా కాళ్లు గాని వేలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు . దీనిని లెగ్ ఎటాక్ అంటారని పేర్కొన్నారు . హార్ట్ బైపాస్ సర్జరీ లేదా స్టెంట్ ఎలా వేస్తామో అదేవిధంగా కాళ్లలో బ్లాక్ అయినా రక్తనాళాలకు బైపాస్ సర్జరీ లేదా స్టెంట్ వేస్తారన్నారు . దాన్ని గుర్తించి తగిన వైద్యం అందించి కాళ్లలో తగిన రక్త సరఫరా పెంచడం ద్వారా వారి యొక్క ప్రాణాలు , కాళ్లు , వేళ్ళు కాపాడుకోగలుగుతాం . ఎక్కువ శాతం షుగర్ పేషెంట్ కు కాళ్లకు ఒకచోట పుండు అయి దాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ సమస్యలు ఏర్పడుతుందన్నారు . ఎవరైనా హాట్ కు ఇంపార్టెంట్ ఇస్తారు గానీ కాళ్లకు ఇవ్వలేకపోతున్నారు అని అన్నారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హై టెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ డి . బాలరాజు , టీం లీడర్ కే . మహేష్ తదితరులు పాల్గొన్నారు .

# సంత్ సేవాలాల్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా చేర్చాలి





### రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 18 :** లంబాడీలా ఆరాధ్యడు , సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేసేందుకు గాను ఒక పాఠ్యాంశం గా చేర్చాలని రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్ అన్నారు. వీరనారీ మణుల ఆశయ సాధన సమితి జిల్లా కార్యాలయంలో బుధవారం లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బానోత్ బద్రు నాయక్ అధ్యక్షతన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు, అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ లంబాడీల ఐక్యతకు వారి సంస్కృతి , సాంప్రదాయ రక్షణకు సేవాలాల్ జీవితాంతం పాటుపడ్డారని కొనియాడారు. బంజారాస్ పేరుతో దేశంలో దేశ దిమ్మరులుగా వలసలు పోతూ , జీవించే లంబాడీలకు ఒక దిశ నిర్దేశాన్ని కల్పించిన మహనీయుడు, సామాజిక విప్లవకారుడు సేవాలాల్ అని పేర్కొన్నారు. తండాల లో నేడు స్థిర నివాసం ఏర్పరచూ జీవిస్తున్న లంబాడీలు ప్రస్తుతంసామాజికంగా , రాజకీయంగా ఎదుగుతున్నారంటే సేవాలాల్ , లంబాడి జాతికి చేసిన సేవలే కారణమన్నారు. లంబాడీల అభివృద్ధికి అభ్యున్నతికి ఆయన అనేక నైతిక అంశాలలో చూపిన మార్గం సదా అనుసర అనుసరణీయమన్నారు. అటువంటి మహానీయుడి జయంతి , వర్ధంతిలా కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సూచించారు.

లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ తమ సంఘం లంబాడీల హక్కుల సాధన తో పాటు వారి సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ , సంత్ సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నాం అంటూ సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి , జిల్లా కార్యదర్శి స్పందన , న్యాయ సలహాదారులు షేక్. నజీమా , సహాయ కార్యదర్శి షరీఫా బేగం , ఆఫీస్ ఇంచార్జి బానోతు కృష్ణవేణి , జిల్లా ఉపాధ్యక్షురాలు బి. జ్యోతి , సలహాదారులు కే .లక్ష్మి , శృతి ,న్యాయవాది వి. లక్ష్మీనారాయణ , బహుజన జేఏసీ , సావిత్రిబాయి పూలే కమిటీల నాయకులు దాసరి శ్రీనివాస్ , నకరికంటి సంజీవరావు , బి. వెంకటేశ్వర్లు , సురభి నాయక్ , వీరన్న నాయక్, ,శ్రీనివాస చారి , ప్రకాష్ ,రవీందర్ ,నాగేశ్వరావు, రమేష్ ,జాన్ భీ ,త్రివేణి , వెంకటనారాయణ , సరోజని , ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

---

## చిన్నారి హత్యకేసు నిదితుడు కులవర్ధన్ ఆత్మహత్య

### చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసుల గుర్తింపు

### అతనది ఆత్మహత్యే అని ఎస్పీ నిర్ధారణ

**అన్నమయ్య,ఫిబ్రవరి18 :** మదనపల్లిలో ఏడేళ్ల చిన్నారి దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కులవర్ధన్ మృతదేహం కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో లభ్యమైంది. అతను ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. చిన్నారి హత్య కేసుపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాతో మాట్లాడుతూ.. కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతదేహాన్ని కులవర్ధన్‌గా అతని బంధువులు గుర్తించారని ఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కులవర్ధన్ బంధువులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. మంగళవారం కులవర్ధన్‌ను అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా.. పోలీసుల నుంచి తప్పించుకుని అతడు పారిపోయాడని తెలిపారు. అతని ఆచూకీ కోసం మూడు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. బుధవారం ఉదయం చెరువులో కులవర్ధన్ మృతదేహం తేలినట్లు తెలిసిందన్నారు. ప్రాథమిక విచారణలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు.

## హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు పూర్తి

### కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు

కడప,ఫిబ్రవరి18 : అన్నమయ్య జిల్లా మదనపల్లిలో దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య ముగిశాయి. మదనపల్లిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన కడప జిల్లా వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లిలో నిర్వహించారు. అంత్యక్రియలకు బంధువులు, స్థానికులు, అన్నమయ్య, కడప జిల్లాల టీడీపీ నేతలు హాజరయ్యారు. అందరూ కన్నీటితో బాలికకు చివరి వీడ్కోలు పలికారు. అంత్యక్రియలకు ముందే, ఈ కేసులో నిందితుడు కులవర్ధన్ మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా కరసానివారిపల్లి చెరువులో అతడి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో ముదివేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు దీనిని ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాలిక అంత్యక్రియలకు ముందే నిందితుడు కులవర్ధన్ మరణంపై మృతురాలి బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

-----------------

## ప్రయాణికుల భద్రత దృష్ట్యా కాంట్రాక్టు క్యారేజ్ (ప్రయాణికుల) వాహనాలలో అక్రమంగా వాణిజ్య సరుకులు రవాణా చేయడంపై కఠిన చర్యలు తీసుకోబడును.

పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై మోటార్ వాహన చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడును. ముఖ్య కూడళ్ళు, జాతీయ రహదారులు మరియు ప్రమాద ప్రదేశాలలో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించబడును. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు/డ్రైవర్లపై భారీ జరిమానాలు విధించబడును. అవసరమైతే వాహనాల స్వాధీనం చేయుటతో పాటు పర్మిట్ రద్దుకు చర్యలు కూడా చేపట్టబడును. కావున వాహన యజమానులు మరియు డ్రైవర్లు నిబంధనలు కచ్చితంగా పాటించి రోడ్డు భద్రతకు మరియు ప్రయాణికుల భద్రతకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది.

## రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు...



**రాంపల్లి,18 ఫిబ్రవరి(చట్టం) :** రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ (6240 కుటుంబాలు) కాలనీలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత భక్తి, ఐక్యత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. 2దీఎఖ రాంపల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కాలనీలోని అన్ని వర్గాల ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చింది. వేడుకల సందర్భంగా హిందూ కుటుంబాలతో పాటు ఇతర మతాల ప్రజలు కూడా పాల్గొని శివరాత్రి జాగారంలో భాగమయ్యారు. రాత్రంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ భక్తి భావంతో పాల్గొనడం విశేషంగా నిలిచింది. దేవాలయ ప్రాంగణం విద్యుద్దీపాలతో అలంకరించబడగా, భక్తుల నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ వేషధారణలో పూజల్లో పాల్గొనగా, యువత స్వచ్ఛంద సేవల ద్వారా కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. 2దీఎఖ రాంపల్లి దేవాలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, కాలనీలోని 6240 కుటుంబాల ఐక్యత, సహకారం మరియు భక్తి భావమే ఈ వేడుకలను విజయవంతం చేసిందని తెలిపారు. ఇలాగే భవిష్యత్తులో కూడా అన్ని మతాల ప్రజలు సౌహార్దంతో కలిసి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

# తొర్రూర్ పట్టణంలో అంబరానంటిన కాంగ్రెస్ సంబరాలు...





- **భారీ ర్యాలీతో విజయోత్సవ సంబరాలు**
- **ప్రజాపాలనే గెలిచింది..**
- **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి .**

**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, ఫిబ్రవరి 18 (చట్టం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లతో భారీ ర్యాలీ నిర్వహించి విజయోత్సవ సంబరాలను అంబరాన్ని అంటే విధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాపక్షమే గెలిచిందని పాలకుర్తి ప్రజలు తెలివైన వారిని మున్సిపల్ ఎన్నికల్లో దాన్ని నిరూపించారని సందర్భంగా వారు అన్నారు. ర్యాలీ సందర్భంగా గెలిచిన కౌన్సిలర్లు చైర్మన్ వైస్ చైర్మన్ లు వీరిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తొరూర్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జరిగిన విజయోత్సవ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ జెండాలు ఊపుతూ నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు..ఈ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ సీపీఐ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా "జై యశస్విని రెడ్డి", "జై ఝాన్సి రెడ్డి" అంటూ మార్మోగిన నినాదాలు పట్టణమంతా రాజకీయ ఉత్సాహాన్ని రేకెత్తించాయి..

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొరూర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసం గెలుపుగా మారిందని, ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి చూసుకుంటానని అన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు వంటి అంశాల్లో వేగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ...ఈ విజయం కార్యకర్తల అంకితభావం, నాయకత్వం, ప్రజా దైవ మద్దతు వల్లే సాధ్యమైందని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని నాయకులకు సూచిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గం మా కుటుంబం ప్రజలు సంతోషంగా ఉండలనేదే మా సంకల్పం అని అన్నారు.

ర్యాలీ అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలను అభినందించి, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం మీద ఈ విజయోత్సవ కార్యక్రమం తొరూర్ పట్టణంలో రాజకీయ ఉత్సాహాన్ని రెట్టింపు చేసి, కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

----------

# యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి పట్టు వస్త్రాలు





- **పట్టు వస్త్రాలను అందజేస్తున్న**
- **పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు**
- **మునిసిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు**

**భూదాన్ పోచంపల్లి ; ఫిబ్రవరి 18 (చట్టం ప్రతినిధి) :** యాదాద్రి లక్ష్మినరసింహ దేవాలయంలో సిరి పుట్టింటివారైన పద్మశాలీలు అమ్మవారి కళ్యాణ సమయంలో సమర్పించే పట్టు చీరలను గత నెల రోజులుగా నిష్ఠ నియమాలతో ప్రత్యేక మగ్గాలతో నేసి బుధవారం పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం మేళతాళ మృగంధ వైద్యాల మధ్యన ఊరేగింపులో యాదగిరిగుట్టలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చేరుకొని ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఆలయ ఈవో భాస్కరరావుకి పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అమ్మవారి పట్టు వస్త్రాలను అందించారు . అనంతరం స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మహాజన సంఘము ఉపాధ్యక్షులు భోగ నరసింహ , అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారతరత్నం , సహాయ కార్యదర్శి కడివేర్ చంద్రమౌళి , సభ్యులు గంజి అంజయ్య, కర్నాటి అంజమ్మ , గుండు పాండు , సిల్క్ యారన్ అధ్యక్షులు సురపల్లి రవీందర్ , మార్కండేయ స్వామి దేవాలయం మాజీ అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరి ,మంగళపల్లి రాజ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు సెయింట్ జార్జ్-1 సి బి ఎస్ ఈ విద్యార్థుల ఎంపిక ;

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 18,( చట్టం బ్యూరో ) :** స్థానిక కరీంనగర్ నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (జదీూజు) విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఇద్దరు విద్యార్థినిలు రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.

**ఎంపికైన విద్యార్థుల వివరాలు:**

**అద్వికానాథ్ (6వ తరగతి):**

టేబుల్ టెన్నిస్ విభాగంలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

**సుహక్షి (7వ తరగతి):**

బాస్కెట్ బాల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రాణించి, హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అద్వికానాథ్, సుహక్షిలను ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించడం గర్వకారణమని, రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఎందుకు సహకరించినటువంటి టేబుల్ టెన్నిస్ కోచ్, బాస్కెట్బాల్ కోచ్ లను మరియు తల్లిదండ్రులను అభినందించారు.




## రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన తుమ్మల యుగంధర్



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 18 :** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా నెలరోజుల పాటు కఠిన ఉపవాసాలు పాటించే ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్

## మిళిత్వ 2కె26 వేడుకలు




**కొడిమ్యాల, ఫిబ్రవరి 18(చట్టం) :** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మిళిత్వ 2కె26 పేరుతో సీనియర్స్ సరిగమ, జూనియర్స్ హంగామా వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.లావణ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..రానున్న ఇంటర్ పరీక్షల్లో ఉన్నతమైన స్థాయిలో ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అలాగే క్రమశిక్షణ కలిగిన జీవితం ఎన్నో విజయాలు సాధిస్తుందని అన్నారు. అనంతరం సెకండియర్ విద్యార్థులు వారికి చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, తరగతి ఉపాధ్యాయులు రమణ, తబస్సుమ్, మల్లేశం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని విద్యార్థి మృతి



**బోయిన్ పల్లి మండలం / ఫిబ్రవరి 18,( చట్టం న్యూస్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్ పల్లి మండలం రత్నంపేట(దుబ్బపల్లి) గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన రామంచ సంజయ్(17) అనే విద్యార్థి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే హైదరాబాద్ లో బి.టెక్ చదువుతున్న సంజయ్ కొద్దిరోజుల క్రితమే ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో మృతి చెందటం పట్ల పలు రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## బాలుడితో బిక్షాటన చేయిస్తున్న తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

**పాఠశాలకు పంపించాలని సూచన**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 18,( చట్టం బ్యూరో ) :** వేములవాడ ఎగ్జిబిషన్ వద్ద భిక్షాటన చేస్తున్న బాలుడిని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట జిల్లా సంక్షేమ శాఖ అధికారులు హాజరు పరిచారు. వేములవాడ పట్టణంలోని ఎగ్జిబిషన్ వద్ద మంగళవారం రాత్రి ఓ బాలుడు గాంధీజీ వేషధారణలో భిక్షాటన చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ లైన్ కు సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మిషన్ వాత్సల్య టీం, చైల్డ్ హెల్ప్ లైన్ టీం ని పంపించారు. వారు బాలుని రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాల ప్రకారము బాలుని పాఠశాలకు పంపించడానికి అతడి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించారు. మరోసారి భిక్షాటన కు పంపించినట్లయితే తల్లిదండ్రులపై జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారము కేసు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం హెచ్చరించారు.

# ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

**ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి**

**33 జిల్లాల నుండి 2,532 మంది క్రీడాకారుల భాగస్వామ్యం**

హైదరాబాద్,ఫిబ్రవరి18 : తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026' సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని క్రీడాకారులు, అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల మధ్య డీజీపీ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీజీపీ డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా కార్యక్రమానికి హాజరైన వారందరినీ అభినందించారు. ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు మరియు సమ్మక్క-సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడం తో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పథకాలు సాధించడం కంటే కూడా మంచి స్నేహితులను సాధించడం గొప్ప అన్నారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలోనూ పెరగాలని, ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను చాటుకోవాలని సూచించారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి, ఐక్యత మరియు పరస్పర గౌరవం ముఖ్యమని, ఇదే స్ఫూర్తిని వృత్తిలోనూ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## నయానా? భయానా?



(సామదానభేదదండోపాయాలు)
అతిప్రేమను ఒలకబోసి
అంతరంగాలను అదుపులోకి తీసుకొని
ఆటలాడించటం –
మంచిమాటల మల్లెలు చల్లి మనసులు
గెలిచి
సొంత పనులు చక్కబెట్టుకోవటం ---
సామోపాయం.

బహుమతులు పంచిపెట్టి ప్రలోభాలకు
గురిచేసి
బుద్ధిని బంధించి తనదారికి తిప్పుకోవటం –
--
ధనాన్ని ఇచ్చి కోరికలను నెరవేర్చి
తలలను వంచేలా చేసి ఆశయాలు
సాధించటం – దానోపాయం.

సన్నిహితుల మధ్య అపార్ధాలు కలిగించి
అనుకున్న కార్యాలు సాధించటం --
బుద్ధిబలం ఉపయోగించి అంతఃకలహాలు
రగిలించి
విధిలేని పరిస్థితులు సృష్టించి
వశంచేసుకోవటం – భేదోపాయం.

అన్యగతిలేని సందర్భాలు కల్పించి
బలప్రయోగమైనా చేసి తలచినది
నెరవేర్చుకోవటం –
హెచ్చరికలతో హింసతో హృదయాలను
గడ్డకట్టించి
కత్తులు చూపి బెదిరించైనా కాళ్లదగ్గరకు
తెచ్చుకోవటం – దండోపాయం.

సామమా, దానమా, భేదమా, దండమా --
-
ఏ దారిలో నడిచినా సాధించేది గమ్యమా?
మనిషిని మానవత్వాన్ని కోల్పోవడమా?
అడ్డదారులు తొక్కి అందుకునేది
విజయమా? --- నయానో...
భయానో...?


చరిత్ర చివర అడుగుతుంది ---
నీ అభీష్టం నెరవేరిందా?
నీ జీవితం నెగ్గిందా?
నీ సామ్రాజ్యం నిలిచిందా? ---
నయంతోనైనా... భయంతోనైనా...?

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## విచక్షణతో విజయాన్ని సాధించు



సమాజ హితమే మా ధ్యేయమని
మేమున్నది మీ బాగు కొరకే అని
సేవా ధృక్పదమే మా లక్ష్యమని
మిమ్మల్ని ఉద్ధరించటయే పరమార్ధమని

ఆకర్షణ పథకాలను ప్రవేశపెట్టి
ఉచిత పథకాలతో ప్రలోభపెట్టినా
ఓటుని నోటుకు అమ్ముకోక
పరమాత్ముడిచ్చిన యుక్తాయుక్త విచక్షణతో
మహనీయుల త్యాగఫలితమే భరతావని అని

ప్రజాశ్రేయస్సు కొరకు పాటుపడే
నిస్వార్ధ, నిష్కళంక కులమతభేదాలకతీతంగ
పనిచేసే నాయకుని
ఓటుని సద్వినియోగం చేసి విజయాన్ని
సాధిస్తే
గాంధీ మాహాత్ముడు కలలు కన్న
రామరాజ్యం తప్పక ఏర్పడుతుంది...!!

కవిమిత్ర, సాహిత్యరత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖపట్నం.

చట్టం సాహితీ లోకం 95814 19999

## అపురూప అనురాగ బంధం!



ఒకరిపై ఒకరికి అవ్యాజమైన ప్రేమ!
తనువులే వేరు మనసు ఇద్దరిదీ ఒకటే!
ఒకరికి ఒకరు తోడూ నీడా!
పాల కలిసిన నీరులా ఒకటిలా!
అదీ సీతా రాముల అనురాగ బంధం!

వెడలు చున్నాడు రాముడు కానలకు!
మును ముందె సిద్ధం పయనానికి సీతమ్మ!
కష్టాల వేళ పతి వెంట సతి!
కంది పోవునని సీతను వారింప యత్నించిన
రామయ్య ప్రేమ!
అదీ సీతా రాముల అనురాగ బంధం!

అరణ్య వాసం. సీతాపహరణం!
కంటికి మిన్నుగా ఇరువురి కన్నీటి ధారా
పాతం!
అనుకోని ఎడబాటు సతీ వియోగం రామ
భద్రుని వ్యాకులం!
లంకేశుని బందీ సీతమ్మ ఉద్వేగ
మానస విచారగ్రస్త!
అదీ సీతా రాముల అనురాగ బంధం!

కన్నెత్తి చూడని పర పురుషుని
వైభవం! సీతమ్మ సౌశీల్యం!
భోగలాలస వివర్జనం, రామయ్య అనవరత
సీతా అన్వేషణ!
ప్రకృతి శోకించింది సీతారాముల హృదయ
విదారక వియోగబాధకు!
కారణ జన్ములు ఇక్కట్ల పాలైనారు!
పెరిగిన దూరాలు దగ్గరైన హృదయాలు!
అదీ సీతా రాముల అనురాగ బంధం!

సీతారాముల దాంపత్యం నాటికీ నేటికీ
ఏనాటికీ జగతికి ఆదర్శం!

రచన:
బాచిరాజు సత్యనారాయణ రావు,
(బా. స.రా)
విజయవాడ.

చట్టం సాహితీ లోకం 95814 19999

## "గన్ను కన్న పెన్ను మిన్న" (ఇష్టపదులు)



1.
కత్తి కన్న ఘనంబు కవులు వాడు కలంబు,
అక్షరజనని దెచ్చు అద్భుతమైన మార్పు,

అందుకే చేయాలి అభిజ్ఞ మణు లెల్లరు
సద్పథమున కలమును చక్కగ
వినియోగము,

అగును తాత్కాలికము అస్త్రము దెచ్చు
మార్పు,
గంటము దెచ్చు మార్పు కలకాలము
నుండుగ,

కలము తలచుకుంటే వెలువడును
విప్లవము,
గన్నుల కన్న పెన్ను ఘనము గాదే "కృష్ణ"!!

2.
చక్కని భావనతో స్వాతంత్ర్య సంగరము
కలము నందున మషిని కదిలిస్తే కలుగును,

మనిషి మనసు నందున మార్పు దెచ్చును
రచన,
కలము దెచ్చెడి మార్పు కలిగించు
నిజాయతి,

తుపాకీ వాడకము దుర్వినియోగం బగు,
సద్వినియోగం బగు చక్కని రాత లెల్ల,

మనిషి కాయ మందున మార్పు దెచ్చు
దళపము,
చేతల కన్న గొప్ప రాత లగును "కృష్ణా"!!

(అక్షరజనని,గంటము = కలము
అభిజ్ఞులు = పండితులు
అస్త్రము, దళపము = ఆయుధము
మషి = సిరా)

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

చట్టం సాహితీ లోకం 95814 19999

## కన్నయ్య యొక్కడే కాపాడు వాడు



కన్నయ్య యొక్కడే గావగ నిందరకు
మన్నుదిన్న పసి అమాయకార్భకుడు

తెలిసిన వారికి తొలివేలు పీతడట
అలసిన వారికి నిలజపు ఛాయయట
తలచిన వారలకు తరుగని నిధియటా
కలిబాధలకు సెలవు నలినాక్షు నామమట

శరణా గతుల పాలి చక్రధరు డీతడు
కరుణాసముద్రుడు కలిమి విభుడితడు
సురలసుధ తేజము శుభ శోభనమ్మీడు
పరమభక్తులపాలి పంచామర తరులీడు

హాటకముతో పలు నాభరణముల భంగి
మాటలాటలు నటనలన్ని కర్మల పుంగి
సాటియెవ రీతనికి సర్వజ్ఞ నుతుడంగి
మేటివిభు డేలికల కేలికనియెను నింగి

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

చట్టం సాహితీ లోకం 95814 19999

## కవలలం మేముకలిసేఉంటాం




మేము ఇరువురం కవలలం
మా అభిప్రాయాలు ఒక్కటే

కానీ మా ఆలోచనలు
వేరు వేరుగా ఉంటాయి

మాలో ఒకరు కవి,కండక్టర్
మరొకరు వ్యవసాయం

ఒకరు కర్ర సామ లో
ఎంతో ప్రతిభావంతులు

ఇంకొకరు కవితలలో దిట్ట
జాతీయ అవార్డుల గ్రహీత

ఒకరు సంఘసేవకులు
ఇంకొకరు ప్రేమ స్వరూపులు

మా మార్గాలు వేరైనా
ఆలోచన విధానాలు ఒకటే

మేముఐదుగురు
అన్నదమ్ములు మాకు
ఇద్దరు చెల్లెళ్ళు కలరు

మాకు రక్తసంబంధీకులంటే
ఎంతో ప్రేమ అభిమానములు

మా అన్నదమ్ములు, చెల్లెలు
మేమంతా కట్టుగా ఉంటాం

మా అందరిదీ ఒకే మాట
మా అందరిదీ ఒకే బాట

బంధుత్వం మాకు మెండు
బాధ్యతలు మాకు ఎక్కువే

మాది ఉన్నత కుటుంబం కాకపోయినా మేము
ఉన్నత భావాలతో ఉంటాం

సమాజ శ్రేయస్సును కోరుతాం
దేశ సౌభాగ్యాన్ని కోరుతాం


సర్వ మతాలను ప్రేమిస్తాం
సర్వ మానవుల సమానమే
మా అందరి ఏకైక లక్ష్యంగా

మేము ఇరువురం కవలలం
సంఘ శ్రేయస్సు కోరేవ్యక్తులం

రచయిత సొపాటి ప్రభాకర్
బ్రాహ్మణ కోడూరు గ్రామం
సాహితీ రత్న తెలుగు తేజం
నంది అవార్డుల గ్రహీత
చరవాణి 81 84 97 44 60

చట్టం సాహితీ లోకం 95814 19999

## తెలుగు వెలుగు శిఖరం



కోనసీమ ముద్దుబిడ్డ
చైతన్య రాజు
(నూతన సాహిత్య ప్రక్రియ వాన చినుకులు)

1. తెలుగు వెలుగు శిఖరం
తెలుగు భాషా దీప్తి
తెలుగు కోసం తపించే హృదయం ఆయన
సొంతం
తెలుగును విశ్వ వ్యాప్తం చేస్తున్న తపస్వి
.... మన కోనసీమ ముద్దుబిడ్డ చైతన్య రాజు

2. తెలుగు సంస్కృతి విలువల పరిరక్షణ
లక్ష్యం
ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహణ
కార్యదీక్షపరుడు
తెలుగు జ్యోతిని వెలిగించిన చైతన్య శిఖరం
దాత ఆరోగ్య ప్రదాత
..... మన కోనసీమ ముద్దుబిడ్డ చైతన్య రాజు

3. తెలుగు సాహిత్యానికి ఆయనే మార్గదర్శి
కవులకు కళాకారులకు రచయితలకు ఆయనే
కళాపోషకులు
విశ్వ తెలుగు వ్యాప్తికి నిరంతరం శ్రమిస్తున్న
అభినవ శ్రీకృష్ణదేవరాయలు
... మన కోనసీమ ముద్దుబిడ్డ చైతన్య రాజు

4. ఆయన పేరు చెబితే
తెలుగు తేజానికి శక్తి
తెలుగు కోసం నిరంతరం ఆయన తపన
చైతన్యవంతమైన వజ్ర సంకల్పం
రాజనీతిజ్ఞుడు బహుముఖ సాధకుడు
తెలుగు తోటకు కొత్త పరిమళం
..... మన కోనసీమ ముద్దుబిడ్డ చైతన్య రాజు

5. తెలుగు తల్లి వైభవాన్ని ప్రపంచానికి
చాటిన తెలుగు తేజం ఆదర్శ రత్న
రెండు ప్రపంచ తెలుగు మహాసభలు
నిర్వహించిన ఘనత వహించిన
కార్యదీక్షా దక్షులు
తెలుగు భాష ఆయన శ్వాస
తెలుగు సింహాసనం ఆయన సొంతం
...ఆయనే మన కోనసీమ తెలుగు ముద్దుబిడ్డ
చైతన్య రాజు

(డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో కిమ్స్ వైద్య కళాశాల ,కిమ్స్ హాస్పిటల్స్ మరియు గోదావరి యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో సంస్థల ఫౌండర్ కె. వి .వి. సత్యనారాయణ రాజు ( శ్రీ చైతన్య రాజు) నిర్వహణలో ఫిబ్రవరి 28 మార్చి 1వ తేదీలు రెండు రోజులపాటు నిర్వహించనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తూ శ్రీ చైతన్యరాజును అభినందిస్తూ రచించిన కవిత)

నడక కవి, అక్షర ప్రవీణ
నల్లా నరసింహామూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు
కురసాల వారి వీధి
అమలాపురం ...533201
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501



చట్టం సాహితీ లోకం 95814 19999

## ఆత్మ జ్యోతిలా వెలగాలి



నీకేల ఈ నిరాశ!?!
ఆత్మ జ్యోతిలా వెలగనిమ్ము
నిరాశ నీడలా మిగలనీ!
బ్రతుకుపై ఆశ ఎల్లవేళల వెలగాలి
నిరాశకెప్పుడూ తావివ్వనీకు!


సాయం సంధ్య వేళల్లో
చల్లని పిల్లగాలిలో తేలియాడుతూ
మనస్సు కయిన గాయాలు
ఆర విరిసిన మందార మకరందాలలో
దూది పింజలై తేలిపోనీ!

పిడికెడు హృదయంలో
ఎన్నో ఆరాటాలు పోరాటాలు
ఆ అలజడులన్నీ పీల్చి పిప్పిచేస్తాయి
ఒకింత ఓరిమితో వాస్తవంలో జీవించు
బ్రమల నుండి మేల్కొని భవిష్యత్ ఏమిటి !?!
జీవన శైలిని ఉల్లాసంగా మార్చుకుంటేనే
జీవితం హృద్యం అవుతుంది,,,,,,!

అనంతానంత మహాసముద్రానికే
ఆటు పోట్లు తప్పలేదు మనమెంత!?!
ఆలోచనల నిరాశ నిస్పృహలే జీవితం కాదు
గదా
పోగొట్టుకున్న జీవితం తిరిగి రానిది
జీవితమనే పరుగు పందెంలో
మనస్సు వికసించిన పూదోట చేసుకుని
ముందుకు సాగితేనే జీవిత సాఫల్యత!

పౌర్ణమి రోజు తప్ప ఆ జాబిలి
ఎన్ని అవస్థల కళలు సంభవిస్తున్నాయ్
అలా అయితేనే జాబిలికి అందం నిభిడీకృతం!
కనుకనే మిత్రమా రంగు రంగుల
సీతాకోకచిలుకల్లా
ఆకాశపుటంచుల దాకా వెలుగులు చిమ్ము
లే లేచి ఒకసారి నిలువుటద్దంలో చూసుకో
సిరి వెన్నెలలు దోబూచులాడుతున్నాయ్
నీలో!!
నీవు నీకోసం జీవించడమే నేడు పరమోన్నతం
అని గ్రహించు!!

అపరాజిత్
సూర్యాపేట



చట్టం సాహితీ లోకం 95814 19999

## వెలిగిన బ్రతుకు

అమావాస్య నడిరేయిలో
మిలుకుమన్న వెలుతురువలే
మిద్దెమీద కూర్చుని చూస్తే
తలుకుమన్న తారలు అవిగో!

మింగ మెతుకు లేనిబ్రతుకు
చిదిమివేసే జీవిత గాధను
తరిమి తరిమి వేసినగాని
తడుముతున్న ఆశయమదిగో!

కాలచక్ర గమనంనా కదిలే
చిరుదివ్వెల తలుకులవలే
కదిలిరాని ఈ దేహాన్నేమో
పలుకరించి పరవశమొందెనో!

చింతచచ్చిన పులుపుచావని
చిగురించే మోడులు ఎన్నో
ఉలుకుపలుకు నోచుకోకా
మత్తులోనే మునిగేదేందరో!

తరతరాలు మారినగాని
తలరాత మారనిజీవులు
తమకంతో చావుటకొరకు
తహతహలా ముంగింపుకొరకే!

మరుజన్మ వుందో లేదో
తెలియని ఈమనుజుల నడుమ
తళుకుమంటు మెలగాలని
తపనతో వెలిగిన ఒంటరిబ్రతుకు!

డా.ప్రసాదు యంవివి(సాదు)
కల్లూరు, ఖమ్మం జిల్లా.



# చట్టం చిత్రం



# నాకు శక్తి.. ప్రేమ అన్నీ సురేఖయే

## భార్య పుట్టిన రోజు చిరు ఎమోషనల్ పోస్ట్

మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ పుట్టినరోజు మరియు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలోనే కాకుండా, జీవిత ప్రయాణంలోనూ తనకు అండగా నిలిచిన సురేఖపై తనకున్న అపారమైన ప్రేమాభిమానాలను ఆయన ఈ సందర్భంగా చాటుకున్నారు. 1980 ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్న ఈ జంట త్వరలోనే 46వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనుండగా, సురేఖ తన విజయాల వెనుక ఉన్న అసలు శక్తి అని చిరంజీవి కొనియాడారు. తన ప్రతి అడుగులో వెంట నడిచిన సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె తమ కుటుంబానికి కేంద్రబిందువని, అందరినీ ప్రేమానురాగాలతో ఒక్కటిగా ఉంచే శక్తి ఆమెకే ఉందని చిరంజీవి పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను సొంతవారిగా భావించి, తల్లిదండ్రులకు కన్నకూతురిగా మారిపోయిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. తన సక్సెస్ గురించి ఎవరైనా అడిగితే అది కేవలం తన టాలెంట్ వల్లనో, కష్టం వల్లనో వచ్చినది కాదని, అది పూర్తిగా సురేఖ వల్లే సాధ్యమైందని చిరంజీవి స్పష్టం చేశారు. ఇంటి బాధ్యతలన్నింటినీ ఆమె భుజాన వేసుకోవడం వల్లే తాను ఎటువంటి ఆందోళన లేకుండా వృత్తిపై దృష్టి పెట్టగలిగానని, ఏ సంక్షోభంలోనైనా తమను కలిపి ఉంచే బలం ఆమె అని ఆయన ఎమోషనల్ అయ్యారు. 'నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే దానికి కారణం నువ్వే' అంటూ తన మనసులోని మాటను హృద్యంగా పంచుకున్న ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మెగా అభిమానులు, సినీ ప్రముఖులు సురేఖ కొణిదెల గారికి పెద్ద ఎత్తున పుట్టినరోజు మరియు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.






# ది కేరళ స్టోరీ సీక్వెల్..ట్రైలర్ విడుదల

## సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్


2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన




ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.


# అల్లు, అట్లీల మూవీ రికార్డు

## అనౌన్స్‌మెంట్ సాంగ్‌కు మిలియన్ వ్యూయర్స్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ ఎఎ23. కేవలం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సరికొత్త చరిత్రను సృష్టించింది ఈ కాంబో. అయితే సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ పాటను కంపోజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాట ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును అందుకుంది. ఈ పాటకి ఇన్‌స్టాలో 1 మిలియన్ కంటే ఎక్కువ రీల్స్ అందుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో ఒక ఇండియన్ ఫిల్మ్ అనౌన్స్‌మెంట్ థీమ్ ఈ స్థాయిలో వైరల్ అవ్వడం ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ 2026లో ప్రారంభం కానుంది.

# అక్కినేని ప్రేమాభిషేకానికి 45 ఏళ్లు పూర్తి




అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉంటారని పేర్కొంది.

# చాలాకాలం రుచి, వాసన శక్తిని కోల్పోయా

## తన అనారోగ్యంపై మమ్ముట్టి తొలిసారి వివరణ

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై తొలిసారి స్పందించాడు. గత ఏడాది జూన్ సమయంలో ఆయన అనారోగ్యానికి గురై దాదాపు నాలుగు నెలల పాటు సినిమాలకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. తాను చాలా కాలం పాటు రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయానని, ఇప్పుడి ప్పుడే నెమ్మదిగా ఆ ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నానని తెలిపారు. కంటి చూపు, వినికిడితో పాటు శ్వాస తీసుకునేటప్పుడు వాసనను గుర్తించగలగడం కూడా ఒక గొప్ప వరమని, అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ అర్థమవుతుందని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. ముఖ్యంగా వినికిడి శక్తి లేని వారి బాధ వర్ణనాతీతమని, మనం ఇతరుల గొంతును వినగలుగుతున్నాం కాబట్టే వారిని మెల్లగా మాట్లాడమని అడగగలమని, కానీ ఆ సామర్థ్యం లేని వారికి శబ్దాల మధ్య తేడా తెలియదని



పేర్కొన్నారు. ప్రస్తుతం మమ్ముట్టి పూర్తి ఆరోగ్యంతో తిరిగి షూటింగ్‌లలో బిజీ అయ్యారు. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బ్జడెట్ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా కోసం మమ్ముట్టి ఇటీవలే డబ్బింగ్ పనులను కూడా పూర్తి చేశారు. ఈ సినిమా




మలయాళ చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. ఎందుకంటే సుమారు 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్ లాల్ కలిసి పూర్తిస్థాయి పాత్రల్లో స్క్రీన్‌ను పంచుకుంటున్నారు. వీరిద్దరితో పాటు విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. నయనతార, కుంచాకో బోబన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# టాప్ 10లోకి దూసుకొచ్చిన ఇషాన్ కిషన్



## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల

టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ టీ20 ర్యాంకింగ్స్?లో టాప్ 10లోకి దూసుకొచ్చాడు. టీ20 వరల్డ్?కప్?లో సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్న ఇషాన్, తాజాగా ఐసీసీ విడుదల చేసిన ర్యాకింగ్స్?లో ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో ప్రస్తుతం 732 రేటింగ్స్?తో ఇషాన్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. ఇక యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానం మెరుగుపర్చుకొని నాలుగో ప్లేస్?కు ఎగబాకాడు. టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్లేస్?లో ఎలాంటి మార్పు లేదు. అతడు 747 రేటింగ్స్?తో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. దీంతో టీ20 ర్యాకింగ్స్?లో టాప్ 10లో నలుగురు భారత బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు ఇటీవల ఆస్ట్రేలియాపై సెంచరీ బాదిన శ్రీలంక స్టార్ బ్యాటర్ పాథుమ్ నిస్సంక మూడు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంక్?కు చేరుకున్నాడు. మరోవైపు భారత యువ సెన్సేషన్ అభిషేక్ శర్మ తన నంబర్ 1 స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గత కొన్ని ఇన్నింగ్స్లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. తన వద్ద ఉన్న 891 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ అత్యుత్తమ టీ20 బ్యాటర్గా అభిషేక్ శర్మ కొనసాగుతున్నాడు. ఇక టీ20 స్పెషలిస్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన నిలకడైన ప్రదర్శనతో 6వ స్థానంలో స్థిరంగా ఉండగా.. యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 4వ ర్యాంకుకు చేరుకున్నాడు. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు ఉండటం టీమిండియా బ్యాటింగ్ బలానికి నిదర్శనం.తాజా ర్యాంకింగ్స్లో ఇతర దేశాల ఆటగాళ్లలో కూడా భారీ మార్పులు కనిపించాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో కొనసాగుతుండగా.. టీ20 ప్రపంచకప్‌లో సెంచరీతో అదరగొట్టిన శ్రీలంక బ్యాటర్ పాతుమ్ నిస్సంకా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్‌జాదా ఫర్హాన్ 5వ స్థానంలో, ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ 7వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్ మాత్రం 10వ స్థానానికి పడిపోయాడు.ఈ ర్యాంకింగ్స్ విశ్లేషిస్తే.. భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్ల హవా స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్ల గైర్హాజరీలో కూడా అభిషేక్, తిలక్, ఇషాన్ వంటి యువకులు ప్రపంచ స్థాయి ర్యాంకుల్లో అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కనబరుస్తున్న దూకుడు రాబోయే మ్యాచ్‌ల్లో ఆయనను మరిన్ని మెరుగైన స్థానాలకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో భారత బ్యాటర్లు ఇలాంటి ఫామ్‌లో ఉండటం జట్టుకు పెద్ద సానుకూలాంశం.

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-10 బ్యాటర్లు

1. అభిషేక్ శర్మ
2. ఫిల్ సాల్ట్
3. పాతుమ్ నిస్సంకా
4. తిలక్ వర్మ
5. సాహిబ్జాదా ఫర్హాన్
6. సూర్యకుమార్ యాదవ్
7. జోస్ బట్లర్
8. ఇషాన్ కిషన్
9. టిమ్ సీఫర్ట్
10. ట్రావిస్ హెడ్

# అభిషేక్ వైపే మొగ్గు చూపుతున్న కోచ్..

టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా విజయవంతంగా సూపర్ 8 రౌండ్‌లోకి అడుగుపెట్టింది. జట్టు మొత్తం ఫుల్ జోష్‌లో ఉన్నప్పటికీ, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ మాత్రం ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. వరుసగా డకౌట్ అవుతూ నిరాశపరుస్తున్న ఈ యువ ఆటగాడి భవిష్యత్తు సూపర్ 8లో ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే టీమ్ మేనేజ్మెంట్ మాత్రం అతనికి పూర్తి మద్దతుగా నిలుస్తుండటం విశేషం.అభిషేక్ శర్మ గణాంకాలు చూస్తుంటే పరిస్థితి కాస్త సీరియస్‌గానే కనిపిస్తోంది. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో అతను ఏకంగా నాలుగు సార్లు సున్నా (డకౌట్) పరుగులకే వెనుదిరిగాడు. ఇందులో రెండు సార్లు ఈ వరల్డ్ కప్ టోర్నీలోనే జరగడం గమనార్హం. మధ్యలో కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌కు కూడా అతను దూరమయ్యాడు. మొదటి బంతి నుంచే భారీ సిక్సర్లు, ఫోర్లు బాదడం అభిషేక్ శైలి. ఈ దూకుడు వల్లే అతను టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. కానీ అదే దూకుడు ఇప్పుడు అతనికి శాపంగా మారి వికెట్లు పారేసుకునేలా చేస్తోంది. ఈ వరుస వైఫల్యాలపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సిదాన్షు కోటక్ స్పందించారు. టీ20 లాంటి వేగవంతమైన ఫార్మాట్‌లో బ్యాటర్లు తక్కువ పరుగులకే అవుట్ అవ్వడం చాలా సాధారణ విషయమని ఆయన అన్నారు. దీని గురించి అతిగా విశ్లేషించి బుర్ర పాడు చేసుకోవాల్సిన అవసరం లేదని, అలా చేస్తే ప్రత్యర్థి కంటే మనమే ఎక్కువ అయోమయానికి గురవుతామని అభిప్రాయపడ్డారు. అభిషేక్ శర్మకు గేమ్ ప్లాన్ మీద పూర్తి స్పష్టత ఉందనీ, అనారోగ్యం పాలవ్వకముందు అతను అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడని కోటక్ గుర్తుచేశారు. టీ20 క్రికెట్‌లో 10 బంతుల్లో 30 పరుగులు చేయడం కూడా చాలా కీలకమని, అభిషేక్ అటాకింగ్ మోడ్‌లో ఉండటమే జట్టుకు ప్లస్ పాయింట్ అని కోచ్ పేర్కొన్నారు. ఒకటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన ఆడే పద్ధతిని మార్చుకోవాల్సిన అవసరం లేదని, పిచ్ స్వభావం మరియు పరిస్థితులను బట్టి ప్రణాళికలు మారుస్తామని తెలిపారు. మొత్తానికి సూపర్ 8లో కూడా అభిషేక్ శర్మ తనదైన శైలిలో విరుచుకుపడతాడని మేనేజ్మెంట్ గట్టి నమ్మకంతో ఉంది.



# యూఏఈపై సౌతాఫ్రికా ఘన విజయం



టీ20 వరల్డ్?కప్? గ్రూప్ దశను సౌతాఫ్రికా అజేయంగా ముగించింది. ఆడిన నాలుగు మ్యాచ్?ల్లోనూ విజయం సాధించింది. తాజాగా యూఏఈతో జరిగిన మ్యాచ్?లో సౌతాఫ్రికా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 123 పరుగుల లక్ష్యాన్ని సఫారీ జట్టు 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ర్యాన్ రికిల్?టన్ (30 పరుగులు), డివాల్డ్ బ్రెవిస్ (36 పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ, మహ్మద్ జవాదుల్లా, మహ్మద్ అర్ఫాన్, మహ్మద్ ఫారుక్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.అంతకుముందు బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. అలీషన్ షరాఫ్ (45 పరుగులు), మహ్మద్ వాసిమ్ (22 పరుగులు) చేశారు. సౌతాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ అద్భుతంగా ప్రత్యర్థిని కట్టడి చేశాడు. నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 12 పరుగులే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అన్రీచ్ నోకియా 2, జార్జి లిండే 1 వికెట్ పడగొట్టారు.

# ఆస్ట్రేలియా పాలిట శాపం.. పాకిస్థాన్ పాలిట వరం!

శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో వాతావరణం అనూహ్య మలుపులు తిప్పుతోంది. ఓ జట్టుకు శాపంగా మారిన వర్షం.. మరో జట్టుకు అదృష్టాన్ని మోసుకొచ్చేలా కనిపిస్తోంది. గ్రూప్-బీలో పటిష్టమైన జట్టుగా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాను వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. మంగళవారం జింబాబ్వే, ఐర్లాండ్ మధ్య జరగాల్సిన మ్యాచ్ ఫలితంపై ఆస్ట్రేలియా ఎన్నో ఆశలు పెట్టుకుంది. అయితే వర్షం కారణంగా ఆ మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే రద్దు కావడంతో జింబాబ్వేకు ఓ పాయింట్ లభించింది. దీనివల్ల జింబాబ్వే 5 పాయింట్లతో ముందంజ వేయగా.. ఆస్ట్రేలియా గరిష్టంగా సాధించగలిగే పాయింట్లు 4 మాత్రమే కావడంతో మాజీ ఛాంపియన్లు టోర్నీ నుంచినిష్క్రమించాల్సి వచ్చింది. 2009 తర్వాత ఆస్ట్రేలియా ఇంత త్వరగా ఇంటిముఖం పట్టడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియా విషయంలో విలన్‌గా మారిన వర్షం, ఇప్పుడు గ్రూప్-ఏలో ఉన్న పాకిస్థాన్ పాలిట 'హీరో'గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం పాకిస్థాన్, అమెరికా రెండూ చెరో 4 పాయింట్లతో ఉన్నాయి. అయితే అమెరికా తన గ్రూప్ దశ మ్యాచ్‌లను పూర్తి చేసుకోగా.. పాకిస్థాన్‌కు నేడు నమీబియాతో ఒక మ్యాచ్ మిగిలి ఉంది. ఒకవేళ కొలంబోలో వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దయితే, పాకిస్థాన్‌కు లభించే 1 పాయింట్ వారిని 5 పాయింట్లకు చేరుస్తుంది. తద్వారా ఎలాంటి కష్టం లేకుండానే అమెరికాను వెనక్కి నెట్టి పాక్ సూపర్-8కు అర్హత సాధిస్తుంది. కొలంబోలోని ఎస్ఎస్సీ స్టేడియంలో వాతావరణం మ్యాచ్ నిర్వహణకు అనుకూలంగా లేదు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం..మధ్యాహ్నం వేళ ఉరుములతో కూడిన భారీ వర్షం పడే అవకాశం 60-70 శాతం వరకు ఉంది. ఒకవేళ వర్షం తగ్గినా, తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా మ్యాచ్ ఆలస్యమయ్యే లేదా ఓవర్లు తగ్గించే అవకాశం ఉంది. పూర్తిగా మ్యాచ్ రద్దయితే పాకిస్థాన్ నేరుగా తదుపరి దశకు వెళ్తుంది. పాకిస్థాన్ అభిమానులు వర్షం కోసం ఎదురుచూస్తుంటే, అమెరికా మాత్రం మ్యాచ్ జరగాలని, అందులో నమీబియా సంచలనం సృష్టించాలని కోరుకుంటోంది. ఒకవేళ వర్షం పడకుండా మ్యాచ్ జరిగి, అందులో నమీబియా పాకిస్థాన్‌ను ఓడిస్తే మాత్రం అమెరికా చరిత్ర సృష్టిస్తూ సూపర్-8కు చేరుకుంటుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆట కంటే వాతావరణమే జట్ల తలరాతలను నిర్ణయించేలా కనిపిస్తోంది.




# ఆకాశమే హద్దుగా చెలరేగిన సాహిబ్‌జాదా ఫర్హాన్



టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. నమీబియాతో జరిగిన కీలక పోరులో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. పసికూన బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ కెరీర్‌లో మొట్టమొదటి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేశాడు. కేవలం 57 బంతుల్లోనే 11 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో వంద మార్కును అందుకున్న ఫర్హాన్, ఈ క్రమంలో టీమిండియా స్టార్ బ్యాటర్ ఈషాన్ కిషన్‌ను వెనక్కి నెట్టి సరికొత్త రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఫర్హాన్.. చివరి వరకు నాటౌట్‌గా నిలిచి 58 బంతుల్లో 100 పరుగులు పూర్తి చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 172.4గా నమోదైంది. గతంలో అతని అత్యుత్తమ స్కోరు 80 పరుగులు కాగా, ఇప్పుడా రికార్డును అధిగమించాడు. ఫర్హాన్‌కు తోడుగా సైమ్ అయూబ్ (41 పరుగులు), కెప్టెన్ సల్మాన్ ఆగా (67 పరుగుల భాగస్వామ్యం), షాదాబ్ ఖాన్ (81 పరుగుల భాగస్వామ్యం) అండగా నిలవడంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో బాదిన 4 సిక్సర్లతో ఫర్హాన్ ఒక అరుదైన ఘనత సాధించాడు. ఈ వరల్డ్ కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 4 మ్యాచ్‌లలో 11 సిక్సర్లు ఉన్నాయి. ఇంతకుముందు 10 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్న ఈషాన్ కిషన్, షిమ్రాన్ హెట్మెయిర్‌లను అతను రెండో స్థానానికి నెట్టేశాడు. అంతేకాదు, ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలోనూ ఫర్హాన్ టాప్‌లోకి దూసుకొచ్చాడు. 4 మ్యాచ్‌ల్లో 220 పరుగులతో అతను నంబర్ వన్ పొజిషన్‌లో ఉన్నాడు. ఈ రేసులో సౌతాఫ్రికా కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ (178 పరుగులు) రెండో స్థానంలో ఉండగా, టీమిండియా ఓపెనర్ ఈషాన్ కిషన్ 158 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఫర్హాన్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటం పాకిస్థాన్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అటు బ్యాటింగ్ పవర్‌తోనూ, ఇటు సిక్సర్ల వేగంతోనూ అతను వరల్డ్ కప్‌లో హాట్ టాపిక్‌గా మారాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999